# కథ ముగిసిన తరువాత—

బి. నాదమునిరాజు

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ వచ్చి స్టేషన్‌లో ఆగింది. విజయవాడ ప్లాటుఫారమంతా మహా హడావిడిగా వుంది. ప్రయాణీకుల గోల కంటె టీ, సిగరెట్లు పళ్లు అమ్మేవారిగోల అధికంగా వుంది. అప్పుడే వచ్చి టిక్కెట్టు కొన్న రమణరావు గబగబా ప్లాటుఫారంమీదికొచ్చి ఒక యింటర్ క్లాసు పెట్టెలో చొరబడ్డాడు. చిన్న క్యారేజీ. ఏడెనిమిదిమంది మాత్రమే వున్నారు. కావలసినంత స్థలముంది. చేతిలోని లెదర్ బ్యాగు సీటుపైని పడేసి గట్టిగా ఆవళించి చిటకవేస్తూ తనూ కూల బడ్డాడు. గోధుమరంగు ఫుల్‌సూటు, బంగారు ఛాయగల అతని దేహానికి యెంతో అందంగా వున్నట్టుంది. నలభైయోపడి దాటి వుండొచ్చు కాని అంత వయస్సు గలవానిలా కనిపించడు. రెండునిముషాలాలా కూర్చుని బ్యాగ్ తెరచి అందులోని యింగ్లీషు వీక్లీ నొకదాన్ని చేతులోకి తీసుకున్నాడు.

కథానిక

వాకిటి దగ్గరే కార్నర్ సీటులో కూర్చున్నాడతను. ట్రయిన్ కదిలే సమయమైంది. బెల్ కూడా గణగణమని మ్రోగింది. ఇంతలోనే బయటనుంచి "తలుపు తెరువండీ!...తలుపు" అంది ఒక కోమల కంఠస్వరం తొందరపాటులో. రమణ రావు తలుపు తెరవటం, మధ్యవయసులోని ఒక స్త్రీ భుజంపైని ఒక బిడ్డతో పెట్టెలో ప్రవేశించటం, ట్రయిన్ కదలటం మూడుసంఘటనలూ ఒకేమారు జరిగాయి. "థ్యాంక్సు" అందామె, తల వంచుకొని లోనికి ప్రవేశిస్తూ.

రమణ తిరిగి తన సీటులో కూర్చుని పత్రికలో లీనమయినాడు. క్రొత్తగా వచ్చినావిడ అతని కెదురుగుండా సీటులో ఉస్సురని నిట్టూరుస్తూ కూర్చుంది. ప్రక్కనే సీటుపైని ఒక టవల్ వేసి బిడ్డను పరుండబెట్టి పేపర్ చదువుతుంటున్న రమణరావువేపు పరిశీలనగా చూసింది.

ఆ...ఎవరతను? రమణరావేనా? ఆమె ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కు పరుగెత్తాయి. విశాలమైన ఆమె కళ్ళు ఒక్క క్షణం పాటు ఆనందంతో మెరిశాయి. చిన్న పొడిదగ్గు దగ్గి "మీరు!—" అంది.

పత్రికను శ్రద్ధగా చదువుతున్న రమణరావు దిగ్భ్రాంతుడైనాడు ఆమె పిలుపు విని తలెత్తి నన్నేనా అనే ధోరణి చూపులతో ఆమెవేపు చూస్తోంటే ఆవిడ్నింతకు మునుపు యెక్కడో చూసినట్లు ఫీలయినాడు. అంతే.

"మీరు..." కొంచెంసేపాగి "కె. యస్. రమణరావుగారుగదూ!" ఆమె అంది చిరునవ్వులో. అతని మెదడులోని మరలు తీవ్రంగా పనిచేశాయి. ఒక క్షణికంపాటు అలా నివ్వెరపోయి చూస్తూ "సీతా!" అన్నాడు. అనటమేమిటి దాదాపు కేక బెట్టాడు.

"ఎన్ని ఏళ్ళకు సీతా!" అన్నాడు రమణ. అతని ముఖంలోకి, సర్వావయవాలలోకి ఆరిపోతున్న యౌవనోత్సాహం వచ్చినట్టయింది. సంతోషమూ, ఆత్రుత సమపాళ్ళలో వున్నాయి అతనిలో ఆ క్షణంలో.

ఆమె ముఖంలో సంతోషం, ఆతురతలకంటే గంభీరతే ఎక్కువుంది. "ఇన్నేళ్ళయినా మీలో ఏ మార్పూ రాలేదు. ప్రయాణ మెక్కడిదాకా?" ఆమె ప్రశ్నించింది మామూలుగా.

రమణరావుకి నిరుత్సాహపూరితంగా వినిపించిందావిడ ప్రశ్న; మనస్సు చివుక్కుమంది. ఆమెతో యేమేమో మాట్లాడాలని యెన్నో విషయాలు తెలుసుకోవాలని అతను తహతహ పడ్తోంటే మామూలు ప్రయాణీకుడిని పరామర్శించినట్లు 'యెందాకా?' అని ఆవిడ ప్రశ్నించటం అతనికి కొద్దిగా బాధకలిగించింది. అయినా ఆ బాధని పైకి కనుపించనీలేదతడు.

ఆమె ప్రక్కనే పడుకొని నిద్రపోతూ నిద్రలోనే చిరునవ్వు నవ్వుతున్న బిడ్డపైకి పోయిందాతని దృష్టి. చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ, "ఒకరేనా?..." అడిగాడు.

అతని వేపే యేదో ఆలోచనగా చూస్తున్న సీత ఆ ప్రశ్నలో కొద్దిగా తుళ్ళిపడ్డట్టయి తేరుకొని "కాదు..." అంటూ మూడు వేళ్లు చూపింది.

ఏమేమో అడగాలని తహతహలాడినా సంభాషణను ఎలా ప్రారంభించాలో తోచలేదతనికి. రెండుమూడు సార్లు యేదో మాట్లాడబోయి తిరిగి ఊరుకున్నాడు. 'మెడ్రాసులోనేనా వుంటూంట?' అడిగిందామె.

అవునని తలూపాడతను.

సీతనూ తననూ మధ్య చీనా గోడలాంటి బ్రహ్మాండమైన జడపదార్థమేదో వేరుచేస్తూ నట్లని పించిందతనికి.

"మీ ఆయనేం సేంపని చేస్తున్నాడు!" నసుగుతూనే ప్రశ్నించాడు.

"హైవేసులో అసిస్టెంటు యింజనీరు. మీరు?" ప్రశ్నించిందామె.

"కాలేజీలో లెక్చరర్ని." అన్నాడతను క్లుప్తంగా.

ఇంతలోనే నిద్రపోతున్న పాపలేచి కెవ్వుమని యేడ్చింది. రమణలేచి పాపనెత్తుకోబోయాడు. అదేసమయంలోనే ఆమెకూడా బిడ్డనెత్తుకోబోవటంలో నాలుగు చేతులు బిడ్డపైని ఒక్కసారిగా కలిసాయి. అలానే ఒకే ఒక్కక్షణంపాటు సీతా రమణారావులు ఒకరి కండ్లలో కొకరు చూసుకున్నారు.

• • •

అవి అతని కాలేజి దినాలు. సీతా, అతడ్నూ సహాధ్యాయులే కాకుండా యిరుగు పొరుగున నివసిస్తూవుండేవారు నారాయణరావుగారు అంటే రమణరావుతండ్రి పట్టణంలో పేరుమోసిన కంట్రాక్టర్. లక్షాధికారి. పైగా సనాతన పరాయణుడు. ఎంతమంది అధికారులలో కలసిమెలసుతూన్నా సంధ్య వాల్చందే పచ్చి మంచినీళ్ళ నయినా ముట్టే వాడు కాదాయన. ఏడాదిపాటు సీతారమణరావులు ఒకరొకరు చూచుంటూ వుండటమేగాని చెప్పుకో దగ్గ స్నేహమేమీ యేర్పడలేదు. సీత తండ్రి తహశీల్ దారుగా వుండేవారు. నారాయణరావుగారికి తహసిల్ దారుకు రోజురోజుకీ స్నేహం బలపడ్డంతో ఒకరిళ్ళకు ఒకరు తరచుగా రాకపోకలు సాగించేవారు. సీతను చూచినప్పుడల్లా, నవ్వుతే సొట్టలు పడే ఆమె లేతబుగ్గల్ని చూచినప్పుడల్లా రమణరావు గుండెల్లో యేవో క్రొత్త భావాలు ఉదయించేవి. సీతను తన దాన్నిగా చేసుకోవాలనే వాంఛ రోజురోజుకీ అతనిలో బలపడుతోంది. ఒకరోజు ధైర్యంచేసి తన భావాల్ని కాగితంమీద పెట్టి ఆమెకందించాడు. ఇవ్వడానికేమో ధైర్యం చేసి యిచ్చాడేకాని దాన్నెలా ఆమె భావిస్తుందో నని బెంబేలుపడ్డాడు.

మరునాటి వుదయం కాలేజీకి పోతూ తన నోట్సును తిరిగి యిచ్చిందామె! అతననుకున్నట్లే దానిలో చిన్న వుత్తరం వుంది. ఆ లేఖ సారాంశము—ఆమెకూ యిష్టమున్నట్లు. కాని పెద్దల అనుమతితో వివాహం చేసుకుందామని అందులో ఆమె వ్రాసింది. ఆనాటినుంచీ వారి జీవితాల్లో గొప్ప మార్పు వచ్చింది. కళ్ళతోనే ఆగిపోయే వారి సంభాషణ కాలేజీ వదలిన వెంటనే అలా షికార్లకి వెళ్ళే దశలోకి కూడా పోయింది. చల్లని సాయంసమయాల్లో కృష్ణానది ఆనకట్టమీద కూర్చుని ఒకరొకరు జీవితంలో విడనాడ రాదని యెన్నోసార్లు ప్రమాణాలు చేసుకున్నారు.

ఒకరోజు కాలేజీ వదలిన వెంటనే సీత రమణ రమణరావును పిలచి గద్గదస్వరంతో యిలా అంది: "మా నాన్న నాకోసం వేరే సంబంధం చూస్తున్నారు" అని ఆగిపోయింది.

రమణరావు నెత్తిన ఒక్కసారిగా పిడుగు పడ్డట్టయింది. అయినా తేరుకుని "భయపడబోకు. ఈ రాత్రే మా నాన్నతో సంప్రతించి రేపు మేం పెళ్ళిచూపులకి వస్తాం" అని భరవసా ఇచ్చాడు.

రాత్రి భోజనాలముందు జంకుతూ యీ ప్రస్తావన తెచ్చేసరికల్లా నారాయణరావుగారు ఉగ్రులైపోయినారు. అతనికి ఏ లక్షాధికారితోనో సంబంధం చేయాలని, కనీసం పదివేలు కట్నం సంపాదించాలని ఆలోచన లున్నాయి. కాని వాటిని బయటపెట్టకుండా "వారి శాఖ మన శాఖ వేరనే జ్ఞానమైనా వుండక్కర్లా!" అని గర్జించాడు.

"కాదు-నేను..." నసిగా డతను.

"నీవు నోరుమూసుకు పడివుండవచ్చు" జవాబొచ్చింది.

తండ్రంటే పులిని చూచినట్లుగా భావించే అతను మరేం మాట్లాడలేకపోయాడు. తలగడంతా కన్నీళ్ళతో తడిసిపోయేలా ఏడ్చాడా రాత్రి! తనింకెలా ముఖం చూపించగలుగుతాడు సీతకి! తండ్రిని ఎదిరించి తన ఆశయాన్ని సాధించుకునేందుకు అసమర్థుణ్ణని భావించాడు. ఆశయానికి పలాయనవాదం పఠించినట్లే ఆ వూరినుంచి పలాయనమైనాడు

రెండు నెలలు బొంబాయిలో ఎన్నో కష్టాలు పడ్డాడు. అస్తులు వస్తులు గడిపాడు. తను చదివిన ప్రేమ కథల్లోని భగ్న ప్రేమికులు గుర్తొచ్చారాతనికి. ఆత్మహత్య చేసుకుందామని కూడా యెన్నోసార్లు ప్రయత్నించాడు. కాని అందుకు కూడా ధైర్యం లేకపోయింది. తుదకెలానో ఓ చిన్న గుమాస్తా వుద్యోగం సంపాదించాడు. కాని నెల రోజులు తిరక్కముందే తన తల్లి బెంగపెట్టుకొని మంచం పట్టిందని తెలుపుతూ తండ్రి వేసిన పేపర్లలోని అడ్వర్టైజుమెంటుల్ని చూసుకొని యిల్లు చేరాడు.

సీతకి నెలన్నర క్రిందటే పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిందని తెలుసుకొని అతడుపడ్డ బాధ యింతా అంతా కాదు. ఆబాధే శ్రుతిమించిందేమో క్రోధముగా పరిణమించింది. తన అసమర్థతని మరచిపోయి సీతని చెడామడా తిట్టుకున్నాడు మనసులో. నిజమైన ప్రేమికురాలు నోరు మూసుకుని తన కిష్టంలేని పెండ్లి చేసుకోవటం అతను వూహించని విషయం! ఆ కోపమే అతని హృదయానికి శాంతినిచ్చింది. తిరిగి మామూలు జీవితంలో పడ్డాడు. ఆ సీతే నేడు తన యెదురుగుండా కూర్చునివుంది!

సరిగ్గా అదే సమయంలో అదే విషయాన్ని గురించే సీతకూడా ఆలోచిస్తోంది. కాలం యెంత కఠినంగా ప్రవర్తిస్తుంది? అతడూ—నేను అనే తారతమ్యంలేకుండా యిద్దరమూ ఒక్కరమై జీవించవలసిన తమ నేవిధి వేరుచేసింది? 'రేపు పెళ్ళిచూపులకు వస్తా'మని నన్నోదార్చి తెల్లవారే సరికి ఫికర్ లేకుండా పోయినాడతను. వారింటికి వెళ్ళి అతన్నిగూర్చి విచారిస్తే నేనే యేదో తీరని అన్యాయం వారికి చేసినట్లుగా ప్రవర్తించారు. సరిగా జవాబయినా యిచ్చారా? రోజులు సాగిపోతున్నాయి. కాని అతని జాడే లేదు. ఏ ధైర్యంతో తను తలిదండ్రుల్ని యెదిరిస్తుంది? అథవా అతనిమీది భరవసాలో యెదిరించినా అతని ధోరణి ఎలా వుంటుందో! లేకుంటే యీ గుప్పెడు ప్రాణాన్ని ఏ బావిలో బలియిస్తే! రానురాను అతను చేసిన పనికి అతనంటే అసహ్యం పెరిగిపోయింది. నాన్న తెచ్చిన సంబంధాన్ని సంతోషంతో అంగీకరించింది. తనిప్పుడు ముగ్గురు బిడ్డలతల్లి!

అలా ఆలోచిస్తూ సీత పిల్లాడికి పాలుపట్టింది. పాలుత్రాగికూడా వాడు ఏడుపు మొదలుపెట్టాడు. సీత వాడిని ఓదార్చాలని యెంతో ప్రయత్నిస్తూ హఠాత్తుగా రమణవేపు చూసింది. కళ్ళనిండా గమ్ముకున్న నీటినతడు చేలిగడ్డతో ఒత్తుకుంటున్నాడు. "మీరు..." యేమో అనబోయిందావిడ.

"కంట్లో బొగ్గునలుసు పడింది. పిల్లాడినిలా యివ్వండి." లేచి రెండుచేతులు చాచాడతను.

ఆమె ఒక్కక్షణంపాటు అలానే చూస్తూ బిడ్డడిని అందించింది. అంతవరకూ కేకలుపెట్టి ఏడుస్తున్న వాడు ఊరుకున్నాడు. రమణ బిడ్డవైపు పరిశీలనగా చూచాడు. అలా చూస్తూనే తిరిగి సీత వేపు ఓసారి చూచాడు. వాడంతా తల్లిపోలికే. విశాలమైన ఆ కళ్ళు, తీర్చిదిద్దినట్టుండే ఆ కనుబొమలు. ట్రైన్ పోతోంటే తలుపువద్ద నిలబడి బిడ్డను ముద్దాడుతున్నాడతను.

పిల్లాడు రమణరావు చేతుల్లోనే నిద్రపోయాడు. సీత వాణ్ణితీసి సీటుమీద పరుండబెట్టి "రేపో యెల్లుండో తప్పక మీరోసారి రావాలి. మా వారితో పరిచయం చేసుకుందురుగాని" అంది తన అడ్రెస్‌గల కార్డు చేతికిస్తూ.

అతని చేయి అప్రయత్నంగా ఆ కార్డుని తీసుకుంది. అతని మనసెందుకో కలుక్కుమంది. 'అహ్' అని మనసులోనే అనుకుని సరేనని తలూపాడు.

తిరిగీ యిద్దరి మధ్యా దీర్ఘ మౌనం తిష్ఠవేసుకుంది.

సెంట్రల్లో మామూలు వీడ్కోలు మినహా సీతా రమణరావులు మరేం మాట్లాడలేదు. అనుకోకుండానే రమణరావు సీత యిచ్చిన కార్డును ముక్కలుచేసి విసరివేస్తూ పోయాడు. ★